క్లుప్తంగా

విలువలతో కూడిన కవిత్వం మొల్ల ప్రత్యేకం..

తలకొండపల్లి: విలువలతో కూడిన కవిత్వం మొల్ల ప్రత్యేకమని కుమ్మరి సంఘం నాయకులు అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి మొల్ల మాంబ విగ్రహాన్ని మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రామాయణాన్ని వివిధ భాషల్లో ఎందరో రచించారని, వాల్మీకి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలో రచించడం గర్వించదగిన విషయమన్నారు.

సీఎంను కలిసిన కిషన్ రెడ్డి



సీఎంతో మార్కెట్ మాజీ చైర్మన్

మాడ్గుల: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం నగరంలోని ఆయన నివాసంలో ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి అభివృద్ధికి ప్రాధన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారని కిషన్ రెడ్డి తెలిపారు. నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాచారం: మండల పరిధి పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మల్కీజ్‌గూడ, నందివనపర్తిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సం చేయనున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం

తలకొండపల్లి: అంబేడ్కర్ ఆశయాలను సాధించి, బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు చేద్దామని జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ జిల్లా నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో జైభీమ్ సభ్యులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు జోకూరి ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక నాయకులు మోహన్‌రెడ్డి, అజీం, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం



వెంకయ్యను సన్మానిస్తున్న పూసల సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వై.వెంకయ్యను శనివారం పూసల సంఘం రాష్ట్ర నాయకులు ఆమనగల్లులో కలిశారు. శాలువాతో సన్మానించి, సంచార జాతుల జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు. సంచార జాతులకు రుణాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భాస్కర్, పురుషోత్తం పాల్గొన్నారు.

గుంతపల్లిలో రాములోరి కల్యాణం



ఉత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి దంపతులు

ఇబ్రహీంపట్నం: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి గుంతపల్లి గ్రామం సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం గ్రామం పుర వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంతటి భూకైలాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి, సీఐ అంజిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసుగౌడ్, మాజీ సర్పంచులు వెంకటేశ్, వరలక్ష్మి, నాయకులు అంతటి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



కడ్తాల్: హనుమాన్ భక్తుల బైక్ ర్యాలీ



ఆమనగల్లు: హనుమాన్ దేవాలయంలో భక్తుల పూజలు

శోభాయమానంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల వీధులన్నీ కాషాయ జెండాలతో వర్ణశోభితాన్ని తలపించాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి భక్తజనం ప్రత్యేక పూజలు చేశారు. పండితుల ఆధ్వర్యంలో తమల పాకులు, పంచామృత అభిషేకాలు జరిపించారు. అనంతరం పట్టణాల్లోని వీధులు, రహదారులగుండా జై శ్రీరాం.. జై హనుమాన్ నినాదాలతో భక్తులు శోభాయాత్ర, బైక్‌ర్యాలీ నిర్వహించారు. -సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆమనగల్లు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమత్‌హోమంలో భక్తులు



మాడ్గుల: ఇర్విన్‌లో..



యాచారం: నల్లవెల్లి గ్రామంలో..



ఇబ్రహీంపట్నం రూరల్: సంగమేశ్వర ఆలయంలో..



ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్‌లో.. శోభాయాత్ర



బాటసింగారం ఆంజనేయస్వామి సన్నిధిలో..

విధి నిర్వహణలో బదిలీలు సహజం



కడ్తాల్: సీఐలను సన్మానిస్తున్న నాయకులు



ఆమనగల్లు: సీఐ జానకిరాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్
- సీఐలను సన్మానించిన పోలీసు సిబ్బంది, నేతలు

కడ్తాల్: విధి నిర్వహణలో బదిలీలు సహజమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌లు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న సీఐ శివప్రసాద్, బాధ్యతలు చేపట్టిన సీఐ గంగాధర్‌లను శనివారం వారు ఘనంగా సన్మానించారు. అనంతరం శివప్రసాద్‌కు వీడ్కోలు, గంగాధర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీక్యానాయక్, హీరాసింగ్, జవహర్, సాయిలు, సేవ్యా, శంకర్, రాందాస్‌నాయక్, డాక్టర్ శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎస్ఐ ఆధ్వర్యంలో సన్మానం

సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సీఐ సిలివేరు శివప్రసాద్‌ను.. ఎస్ఐ శివశంకర వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో 18 నెలలుగా ఆయన అందించిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. అంకితభావం, సమయస్ఫూర్తితో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశారని కొనియాడారు. అదే విధంగా నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌కు స్వాగత సన్మానం చేశారు. ఎస్ఐతో పాటు ట్రైనీ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది దశరథం, తిరుపతి, రాంకోటి, శ్యాంసన్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన గంగాధర్

కడ్తాల్ సీఐగా సీహెచ్.గంగాధర్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ సిలివేరు శివప్రసాద్.. సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శామీర్‌పేట్ ఠాణాలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్న గంగాధర్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో.. మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు విజయ్, భాస్కర్, స్వామి, దేవేందర్, కుమార్, అనిల్, భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కలప్పి సన్మానించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మంచాల: మండల పరిధి కాగజ్ ఘట్ గ్రామంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా సంగం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

బండలేమూర్‌లో..

రేపు మండలంలోని బండలేమూర్ గ్రామంలో మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ వారి సహకారంతో మెగా ఉచిత రక్త దాన శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఏసీసీ కెపీవీ రాజు రానున్నారని పేర్కొన్నారు.

ముగిసిన ఆలయ ఉత్సవాలు



ఉత్సవ మూర్తుల ఊరేగింపు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో శ్రీ విజయగణపతి, శ్రీజ్ఞాన సరస్వతి, శ్రీ సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీతారామచంద్ర స్వామి దేవతా మూర్తులను పల్లకీలో గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బస్వారాజ్ రాజమణి, భక్తులు సంతోష్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్ పంతులు, కృష్ణయ్య, శ్రీకాంత్, అంజయ్య, వినయ్‌కుమార్, రామశర్మ, సంతోష్ కుమార్, మల్లికార్జున్, సాయికుమార్, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం పెంపొందుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామం వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం బోగ్ భండార్, ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఫల పంచామృత అభిషేకం, సింధూర ధారణ, పత్రపూజలు, నాగవల్లి, ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రత పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు చేగూరి వెంకటేశ్, సత్యం, హీరాసింగ్, రాంచందర్, జవహర్‌లాల్, లక్ష్మయ్య, రాజేశ్, షాబుద్దీన్, భరత్ యాదవ్, తులసీరాం, రాజు ఉన్నారు.



వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాఠశాలకు ల్యాప్‌టాప్స్ అందజేత

మొయినాబాద్: మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు యునైటెడ్ వే ఆఫ్ హైదారాబాద్ ఆకృతి సంస్థ ప్రతినిధులు శనివారం ఆరు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించేందుకు వాటిని ఉపయోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వినోద, సంస్థ ప్రతినిధులు అస్మా, సయ్యద్ ఆరిఫుద్దీన్, రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు సుజాత, స్వర్ణలత, రవి పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

షాబాద్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని నాగర్‌గూడ అంగన్‌వాడీ టీచర్ అంబుజాక్షి, సూపర్‌వైజర్ కళావతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు పోషకాహారం తప్పనిసరని పేర్కొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



స్వయం ఉపాధి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ.. స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో స్పందన ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనతికాలంలోనే 70వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. మరిన్ని కొలువుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. రాజీవ్ యువ వికాసాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెంచు యువజన సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లి రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీలు ధనుంజయ, అనిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాళ్ల రవీందర్, వస్పుల శ్రీశైలం, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, అప్పం శ్రీను, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, ఎంగలి ప్రసాద్, నాజర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘వనజీవి’ సేవలు చిరస్మరణీయం



రామయ్య మృతికి నివాళిగా మొక్క నాటుతున్న సీజీఆర్ నిర్వాహకులు, అధికారులు

కడ్తాల్: పద్మశ్రీ వనజీవి రామయ్య పర్యావరణ రక్షణకు చేసిన సేవలు చిరస్మరణీయమని సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి, చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. దేశం.. ప్రకృతి ప్రేమికుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. శనివారం మండల పరిధి ఎర్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనజీవి మృతికి సంతాపం ప్రకటించారు. ఆయనకు నివాళిగా పలువురు అధికారులు, పర్యావరణ పరిరక్షకులతో కలిసి మొక్కలు నాటి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కోసం వనజీవిగా మారిన దర్పల్లి రామయ్య జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పర్యావరణ వేత్త తులసీరావు, త్రిపుర ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాదరావు, ఎర్త్ లీడర్ జ్ఞానేశ్వర్, సీజీఆర్ సిబ్బంది ఉన్నారు.

కళాకారులకు డప్పుల అందజేత



కళాకారులకు డప్పులు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మొట్టమొదటి ప్రచార సాధనం డప్పేనని, ఆ డప్పుకు నేటికీ విలువ తగ్గలేదని వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘం భవనం వద్ద.. ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సహకారంతో శనివారం పలువురు కళాకారులకు డప్పులు అందజేశారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. దేవాలయాలు, మహనీయుల విగ్రహాలు, పేద విద్యార్థుల చదువుకు సహకారం అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జేఏసీ పట్నం నియోజకవర్గం చైర్మన్ భాస్కర్, మాజీ సర్పంచ్ బండిమీద కృష్ణ, బోడ కృష్ణ, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీను, నాయకులు మహేందర్, నరాల చంద్రపాల్, మడుపు వెంకటేశ్, అరుణ్‌కుమార్, యాదగిరి, రఘు, నర్సింహ, వినయ్‌కుమార్, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆమనగల్లు: బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో.. బ్యాడ్మింటన్ ఆమనగల్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం మండల స్థాయి టోర్నీని ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. అంతకు ముందుకు క్రీడాకారులకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త మల్లేశ్ క్రీడాదుస్తులు అందజేశారు. మూడు రోజుల పాటు టోర్నీ జరగనుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్, సలహాదారులు పాపిశెట్టి అరవింద్, పర్వతాలు, సభ్యులు తిరుపతి, ప్రసాద్, రవి, జంగయ్య, శ్రీను, జగన్, దేవేందర్, వేణు, పవన్, శివకుమార్, వెంకటేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు షురూ



నిర్మాణ పనులు ప్రారంభించిన మాజీ సర్పంచ్

కడ్తాల్: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ‘మేస్త్రీ సంఘం’ స్లాబ్ నిర్మాణ పనులను కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, దాతల సహకారంతో పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో.. ఒక్కో కుల సంఘం భవనానికి రూ.5 లక్షల చొప్పున కేటాయించి, పలు భవనాలను రూ.25 లక్షలతో పూర్తి చేయించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాలరాజ్, సభ్యులు మహేశ్, జంగయ్య, రాములు, నర్సింహ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని అంబేడ్కర్ కాలనీలో కందాడ మానిక్యం ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి ఆయన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా వారిని బియ్యం ఎలా ఉన్నాయి.. తింటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపేందుకు ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అంబేడ్కర్ కాలనీలోని ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వారి సమస్యలపై స్థానిక నాయకులు, అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య ఉన్నారు.

ఆర్థిక సహాయం



భిక్షపతికి నగదు అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తోటి కార్మికుల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామానికి చెందిన బజారు భిక్షపతి కుమార్తె ఇటీవల గోడ కూలీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు పట్నం ఆర్టీసీ జేఏసీ నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు అదే ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న ఆయన కుమారుడిని పరామర్శించారు. అనంతరం భిక్షపతికి రూ.81 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.